ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



కూన శ్రీశైలంగౌడ్‌ను కలిసిన స్థానికులు

కుత్బుల్లాపూర్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. షాపూర్ నగర్‌లో ఆయన నివాసంలో వివిధ ప్రాంతాల ప్రజలు కలిసి స్థానిక సమస్యలపై విన్నవించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన ప్రజా సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు, సంక్షేమ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికుల వేతన ఒప్పందం



వేతన ఒప్పంద పత్రాలతో మదన్‌గౌడ్

రంగారెడ్డినగర్: గాంధీనగర్ పారిశ్రామికవాడలోని ఆర్అండ్ ఇంజినీరింగ్ కంపెనీలో మంగళవారం నూతన వేతన ఒప్పందం జరిగింది. గతంలో ఐదు అగ్రిమెంట్ చేసినటువంటి కంపెనీలో ఐదు అగ్రిమెంట్లకు రూ. 6400 పెంచగా. నూతనంగా కార్మిక నేత ముద్దాపురం మదన గౌడ్ నాయకత్వంలో రూ.7700 ప్యాకేజీతో పాటు జీతం అడ్వాన్స్ పాతది రూ.6 వేలు ఉండగా దాన్ని రూ.8 వేలకు పెంచారు. దుస్తులు, షూస్ తదితర వాటిపై ఒప్పందం జరిగింది. మదన్‌గౌడ్‌ను కార్మికులు సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ సుమిత్ సింగ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుభాష్, రాంబాబు, జనరల్ సెక్రెటరీ టి దేవేందర్ సింగ్ సభ్యులు పాల్గొన్నారు.

అమర్‌బాబుకు డాక్టరేట్ ప్రదానం



కుత్బుల్లాపూర్: సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తు సమాజ సేవ చేస్తున్న కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన బుడల అమర్‌బాబుకు గౌరవ డాక్టరేట్ లభించింది. అమెరికాలోని గాడ్ హోలి స్పిరిట్ థియోలాజికల్ అకాడమీ ఈ నెల 10వ తేదీన హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఆయనకు డాక్టరేట్ పట్టాను అందజేశారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

జగద్గిరిగుట్ట: మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో రాణించాలని బీఆర్ఎస్ జగద్గిరిగుట్ట డివిజన్ నాయకురాలు కొలుకుల శశికళ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం డివిజన్ పరిధిలోని కన్యక పరమేశ్వరి ఆలయంలోని కమిటీహాల్‌లో స్థానిక మహిళలతో కలిసి కేక్ కట్ చేసి మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీదేవి, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ ఉషారాణి, రఘునందన్ రావు, హరిప్రియ, సీటీ కిషోర్ కుమార్, వరమ్మ, సువర్ణ, కొలుకుల జ్యోతి, శాంతి, హైమావతి, పద్మ, మంజుల, శోభారాణి, ఝాన్సీ, మాధవి, సుజాత, లక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

ప్రణయ్ హత్య కేసులో న్యాయం గెలిచింది

నిజాంపేట్ : నల్లగొండ జిల్లాకు చెందిన పెరుమాండ్ల ప్రణయ్ హత్య కేసులో జిల్లా కోర్టు ఒకరికి ఉరిశిక్ష మరో ఆరుగురికి జీవిత ఖైదు శిక్ష విధిస్తూ ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని కేవీపీఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.కృపాసాగర్, ఎన్ బాలపీరు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2018లో వైశ్య కులానికి చెందిన అమృతను కులాంతర వివాహం చేసుకున్నాడని పెరుమాండ్ల ప్రణయ్ అనే యువకుడిని అత్యంత కిరాతకంగా హత్య చేయించారన్నారు. మారుతిరావు 2020లో ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

కూకట్‌పల్లి: క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును బాధితురాలి కుటుంబ సభ్యునికి మంగళవారం అందజేశారు. ఫతేనగర్‌కు చెందిన కల్పన అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకుంది. రూ.1.10 లక్షల చెక్కు మంజూరైంది. ఈ చెక్కును మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కుటుంబ సభ్యులకి అందజేశారు. పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అగ్ని ప్రమాదాలతో జనం బెంబేలు!

నివాసాల మధ్య అక్రమ గోదాములు



సుభాష్‌నగర్‌లోని నివాస ప్రాంతంలో ఎగిసిపడుతున్న మంటలు

అక్కడ అన్ని గృహ సముదాయాలు.. అక్రమ మార్గంలో ఏర్పాటు అయిన గోదాములు ఇప్పుడు వారికి దినదిన గండంగా మారాయి.. ఎప్పుడు ఏ సమయంలో ఆపద వస్తుందో అన్న ఆందోళనలో ఉన్నారు.. అక్రమ మార్గంలో వెలిసిన గోదాములను కట్టడి చేయడంలో కుత్బుల్లాపూర్ సర్కిల్ అధికారులు విఫలమయ్యారన్న మాటలు వినిపిస్తున్నాయి. తరచూ ప్రమాదాలు జరిగినా అధికారులు అటువైపు చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. సుభాష్ నగర్ మంగళవారం జరిగిన అగ్నిప్రమాదం కలకలం రేపింది. ప్రాణ నష్టం జరగకపోయినా సుమారు రెండు గంటల పాటు స్థానిక ప్రజలు పరుగులు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. – కుత్బుల్లాపూర్

- భూమిలోకి విష రసాయనాలు
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్

ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం

సుభాష్ నగర్ పరిసర ప్రాంతాల్లో అక్రమంగా ప్లాస్టిక్ గోదాములపై స్థానిక సంక్షేమ సంఘం ప్రతినిధులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అయినా ఏ ఒక్క అధికారి పట్టించుకోవడం లేదు. దీన్ని ఆసరాగా చేసుకొని నివాస ప్రాంతాల్లోనే అక్రమ గోదాములు ఏర్పడుతున్నాయి. ఇందులో వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన ప్లాస్టిక్ కవర్లను డంపు చేయడం జరుగుతుంది. అంతేకాకుండా విష రసాయనాలు కలిసిన డ్రమ్ములను తీసుకువచ్చి ఇక్కడే శుభ్రం చేస్తున్నారు. ఈ క్రమంలో తవ్వి ఆ రసాయనాలను భూమిలోకి వదులుతున్నారు. ఇక్కడ భూమిలో బోర్లు వేస్తే ఎందుకు పనికి రాకుండా ఎర్ర రంగులో నీళ్ల వస్తున్నాయి. ఫిర్యాదు చేయగానే అధికారులు స్పందించి ఉంటే ఇటువంటి సంఘటనలు జరిగేవి కావని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నివాస ప్రాంతాల్లో ఉన్న అక్రమ గోదాములను తరలించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రమాదం జరిగినప్పుడు హడావుడి!

జీడిమెట్ల పారిశ్రామిక వాడకు ఆనుకుని ఉన్న వినాయక నగర్, అయోధ్య నగర్, సుభాష్ నగర్, భాగ్యలక్ష్మి కాలనీ, గణేష్ నగర్ ప్రాంతాల్లో సుమారు 50 వేలకు పైగానే జనం నివసిస్తున్నారు. ఈ కాలనీలో ఖాళీ స్థలాలను గోదాములుగా మార్చి విష రసాయనాలు మొదలుకుని, ప్లాస్టిక్ డబ్బాలు, ప్లాస్టిక్ కవర్లు, ముడి పదార్థాలు తీసుకువచ్చి అక్రమ మార్గంలో వీటిని తరలిస్తారు. ఎక్కడైనా అక్రమ మార్గంలో గోదాము ఏర్పాటు చేసి రసాయన నిల్వలను చేసిన వాటిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి. కానీ పీసీబీ అధికారులు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం విశేషం. ప్రమాదం జరిగిన సమయంలో హడావిడి చేసే అధికారులు తర్వాత ఆ విషయాన్ని మర్చిపోతారు. ఈ తంతు గత కొన్ని ఏళ్లుగా కొనసాగుతుంది. ఇప్పటికైనా రాబోయే రోజుల్లో భారీ ప్రమాదం జరగకముందే పీసీబీ అధికారులు మేల్కొనాలని ప్రజలు కోరుతున్నారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే కఠిన చర్యలు



జరిమానా విధిస్తున్న మున్సిపల్ సిబ్బంది

కుత్బుల్లాపూర్: ప్లాస్టిక్ వినియోగించే దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని కొంపల్లి మున్సిపల్ కమిషనర్ ఎస్.కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం కొంపల్లి మున్సిపల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. తనిఖీ సందర్భంగా ప్రధాన వీధులు, మార్కెట్లల్లో టీ దుకాణదారులు దుకాణాల బయట చెత్త వేయడాన్ని గమనించారు. ఈ నేపథ్యంలో పరిశుభ్రత నిబంధనలను ఉల్లంఘించిన పలువురికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుద్ధ్య నియమాలను పాటించి పట్టణాన్ని శుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. చెత్త తొలగింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు ఆదేశించారు.

థాయ్‌లాండ్ విద్యాసంస్థతో వీజేఐఎం పరస్పర సహకార ఒప్పందం



ఒప్పందం కుదుర్చుకుంటున్న ఇరు కళాశాలలు

నిజాంపేట్ : థాయిలాండ్ దేశానికి చెందిన విద్యాసంస్థ ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీతో విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ మంగళవారం పరస్పర సహకార ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా ఇరు కళాశాలలకు చెందిన విద్యార్థులకు నూతన ఆవిష్కరణలు, బోధనా పద్ధతులను తెలుసుకునే అవకాశముందని కళాశాల వర్గాలు తెలిపాయి. డైరెక్టర్ వీజేఐఎం డా.భరత్ భూషణ్‌సింగ్, డా.రవినాథ్, ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సభ్యులు డా. నితిన్ కె. త్రిపాఠి, ఎం.రణధీర్‌రెడ్డి లెటర్ ఆఫ్ అగ్రిమెంట్‌పై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా భరత్‌భూషణ్ సింగ్ మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలకు చెందిన విద్యావేత్తలు, వ్యాపారవేత్తలను కలవడం, అక్కడ అభివృద్ధి పథకాలు, వాటి నిర్వహణపై అధ్యయనం చేసే అవకాశముందన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు రెండు దేశాలకు చెందిన విద్యాబోధన మరెన్నో విషయాలు తెలుసుకునే అవకాశం ఉందన్నారు. రెండు వారాల పాటు నిర్వహించిన ఈ ప్రోగ్రాంలో 238 మంది విద్యార్థులు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రోగ్రాం కో ఆర్డినేటర్‌లుగా కళాశాల అధ్యాపకులు డా.రవినాథ్, డా.నిహారిక, డా.హరిప్రియ, డా.పద్మజ, డా.అమర్‌నాథ్‌రెడ్డి, డా.శ్రీనివాసరావులు వ్యవహరించారు.

చెట్లను తొలగించారు

- కొంపల్లి మున్సిపాలిటీలో ఘటన
- నోటీసులు ఇచ్చిన మున్సిపల్ కమిషనర్



తొలగించిన చెట్లు

కుత్బుల్లాపూర్: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జయదర్శిని ఎన్‌క్లేవ్‌లో మున్సిపాలిటీ సిబ్బంది అత్యుత్సాహంతో పాతికేళ్ల చెట్లను తొలగించారు. కాలనీలోని పార్కులో అరుదైన వెదురు పొదలున్నాయి. వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామని చెబుతూనే.. చెట్లపై వీరి కన్ను పడింది. నిజానికి వాకింగ్ ట్రాక్ చేయడానికి ఎలాంటి అభ్యంతరం ఎవరికీ లేకున్నా.. ట్రాక్‌ను చెట్ల పక్క నుంచి ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది. పచ్చదనం మధ్య నడిస్తే మంచిది కూడా. అయినా స్థానికుల అభ్యంతరాలను పక్కనబెట్టి మధ్యాహ్నం పూట మున్సిపాలిటీలోని కొందరు సిబ్బందిని తీసుకొచ్చి జేసీబీల సాయంతో చెట్లను కూల్చేశారు. ఈ విషయంపై 'సాక్షి' కొంపల్లి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డిని వివరణ కోరగా.. చెట్లను తొలగింపజేసిన వారికి నోటీసులు జారీ చేసి వివరణ అడిగామని, తదనాంతరం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నీటి ఎద్దడిపై తాళం వేసి నిరసన



వాటర్ వర్క్స్ కార్యాలయంలో ట్యాంకర్లు వెళ్లే గేటుకు తాళం వేస్తున్న కార్పొరేటర్

మూసాపేట: జనతానగర్‌లోని వాటర్ వర్క్స్ కార్యాలయంలోని వాటర్ ట్యాంకర్లు వెళ్లే గేటుకు మంగళవారం కార్పొరేటర్ మహేందర్ తాళం వేశారు. నీటి ట్యాంకర్ల ద్వారా అమ్మకం ఎక్కువగా చేస్తుండటంతో మూసాపేట డివిజన్‌లో ఉన్న బస్తీ వాసులకు నీటి ఇక్కట్లు ఏర్పడుతున్నాయని, మూసాపేట బస్తీ వాసుల నీటి కొరత తీరేంతవరకు నీటి అమ్మకం జరపొద్దంటూ గేటుకు తాళం వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలం మొదలు కాకుండానే బస్తీలలో నీటి కొరత ఏర్పడుతుందన్నారు. బస్తీ వాసుల నీటి సమస్యలు తీర్చేందుకు ఎలాంటి పరిష్కారం ఆలోచించకుండా వాటర్ వర్క్స్ అధికారులు ఉన్న నీటిని కమ్యూనిటీలకు, కాలనీలకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. మూసాపేట డివిజన్ బస్తీలలో నీటి సమస్య తీరేంత వరకు ఏ ప్రాంతానికి నీటిని ట్యాంకర్‌ల ద్వారా పంపించేది లేదంటు గేటుకు తాళం వేసినట్లు ఆయన తెలిపారు. మధ్యాహ్నం 1.30 గంటలకు తాళం వేయగా. అధికారులు కూకట్‌పల్లి పోలీసుల సమక్షంలో 2.30 గంటలకు తాళం తొలగించారు. ఎర్రస్వామి, రవిగౌడ్, మల్లేష్‌గౌడ్, జానకి, అబ్బాస్, రాజేశ్వరి, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌పై కేసు నమోదు

వాటర్ వర్క్స్ మేనేజర్ ఫిర్యాదు మేరకు పోలీసులు బీఎన్ఎస్ఎస్ 132, 127 సెక్షన్ల కింద విధులకు ఆటంకం కలిగించినందుకు, గేట్ కు తాళం వేసి అధికారులను నిర్బంధించినందుకు కార్పొరేటర్‌పై కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఎంపీ ఈటల రాజేందర్



ఆలయం వద్ద మాట్లాడుతున్న ఎంపీ రాజేందర్

చింతల్: దేవాలయాలపై దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీ రాజేందర్ అన్నారు. గాంధీ నగర్‌లోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో జరిగిన ఘటనపై ఆలయాన్ని మంగళవారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో ఆలయాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. పోలీసులు దొంగలను వదిలేసి భక్తులను భయభ్రాంతులకు గురిచేయడం సిగ్గుచేటన్నారు.

నేడు వైఎస్ఆర్‌సీపీ ఆవిర్భావ వేడుకలు

కూకట్‌పల్లి: వైఎస్ఆర్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం ఉదయం 10.30 గంటలకు బాలాజీనగర్‌లోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద జెండా ఆవిష్కరణ, కేక్ కటింగ్ కార్యక్రమం ఉంటుందని వైఎస్ఆర్, జగన్ అభిమానులు ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అధికార ప్రతినిధి శ్యామల, వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ఐటీ వింగ్ అధ్యక్షులు సునీల్ పోసింరెడ్డి పాల్గొననున్నారని తెలిపారు.

రోడ్లను ప్రతి రోజూ శుభ్రం చేయాలి



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న సాయినాథ్

దుండిగల్: రోడ్లపై చెత్తా చెదారం ఉండకుండా సిబ్బంది ప్రతి రోజు శుభ్రపర్చాలని దుండిగల్ మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి వి.సాయినాథ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో మంగళవారం కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్‌తో కలిసి పర్యటించారు. పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్లకు ఇరువైపులా చెత్త కుప్పలు లేకుండా, కలుపు మొక్కలు పెరగకుండా చూడాలన్నారు. ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా కిరాణాషాపులు, హోటల్స్, రెస్టారెంట్‌లలో సింగిల్ యూస్ ప్లాస్టిక్, 120 మైక్రోన్ కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్‌ను వాడవద్దన్నారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ బ్యాన్‌లో భాగంగా మున్సిపల్ పరిధిలో స్పెషల్ టీంలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్లాస్టిక్ బదులు జ్యూట్ బ్యాగులు, చేతి సంచులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీర్ బి సురేందర్ నాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అంజయ్య, రామచందర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ పి సాత్విక్, వార్డు అధికారులు, జవాన్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్ పరిశీలన

గండిమైసమ్మలోని దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్ కేంద్రాన్ని సాయినాథ్ పరిశీలించారు. మార్చి 31 వరకు ఎల్ఆర్ఎస్ పేమెంట్ చేసుకున్న వారికి ప్రభుత్వం 25 శాతం రాయితీ ఇస్తుందని, ఈ అవకాశాన్ని అందరూ ఉపయోగించుకోవాలని సూచించారు. అదేవిధంగా హెల్ప్ డెస్క్ వచ్చిన వారి వివరాలు, సమస్యలను పరిష్కరించి ఎల్ఆర్ఎస్ చెల్లించే విధంగా చూడాలన్నారు. కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్, మేనేజర్ లక్ష్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బిల్లులను ఒకేసారి చెల్లించమనడం సరికాదు



వాటర్ వర్క్స్ డీజీఎంకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

నిజాంపేట్: బిల్లులను 4 సంవత్సరాలుగా ఇవ్వకుండా ఇప్పుడు పంపిణీ చేసి ఒకేసారి చెల్లించమనడం సరికాదని బీజేపీ బాచుపల్లి అధ్యక్షుడు ప్రసాద్‌రాజు అన్నారు. మంగళవారం వాటర్ వర్క్స్ డీజీఎంని కలిసి నీటి సమస్యలపై, అనైతిక బిల్లులపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాచుపల్లి 21వ డివిజన్ సాయినగర్, వివిధ కాలనీలలో కొన్ని వాటర్ మీటర్లకు సంవత్సరాలుగా బిల్లులు ఇవ్వలేదన్నారు. సాయినగర్, రాజీవ్‌గాంధీ నగర్, ఇందిరమ్మ కాలనీలలో సంవత్సరాలుగా నీటి కొరతతో ఇబ్బందులు పడుతూనే ఉన్నారన్నారు. వెంటనే అధికారుల పొరపాటును సరి చేసి సరిపడా నీటిని సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో అశోక్‌నాయక్, నారాయణమూర్తి, ఉదయ్‌కిరణ్, గోపతి సురేష్, కార్తిక్, పావనిరెడ్డి కాలనీవాసులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అధికారులు చొరవ చూపాలి



కాలనీలో పర్యటిస్తున్న సర్పారెడ్డి భూపతిరెడ్డి

దుండిగల్: ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సర్పారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బౌరంపేట్ లోని త్రిపుర లాండ్ మార్క్ కాలనీలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్, ఇరిగేషన్ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. స్థానికంగా డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, అదే విధంగా మిగిలిన సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరారు. దీనిపై స్పందించిన భూపతిరెడ్డి సమస్యలను పరిష్కరించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు బాల్ రెడ్డి, ఉపాధ్యక్షులు నాగేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, సభ్యులు ఐలయ్య గౌడ్, రంగారెడ్డి, తార, అనిల్, సిద్ధు, బౌరంపేట్ మాజీ సర్పంచ్ మిద్దెల యాదిరెడ్డి, ఓబీసీ సెల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ భరత్ గౌడ్, ఎస్సీ సెల్ చైర్మన్ చింతకింది సురేష్, ప్రధాన కార్యదర్శి అర్కల విజయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు గొప్పవరం

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హన్మంత్‌రెడ్డి



ఎల్వోసీ అందజేస్తున్న కొలన్ హన్మంత్‌రెడ్డి

నిజాంపేట్: సీఎం సహాయనిధి పేదలకు గొప్ప వరమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. వీరస్వామి గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. రాష్ట్రమంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా బాధితుడి శస్త్ర చికిత్స నిమిత్తం రూ.4 లక్షల ఎల్వోసీని మంజూరు చేయించారు. ఆ ఎల్వోసీని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ 1వ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజిరెడ్డి, 126 డివిజన్ అధ్యక్షులు గణేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పద్మారావు, ప్రశాంత్‌రెడ్డి, షఫీ, సురేందర్, శివకుమార్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన ముమ్మరం!

- జిల్లాలోని 13 పురపాలికల్లో ఎల్ఆర్ఎస్‌కు 1.64 లక్షల దరఖాస్తులు
- నెలాఖరుకల్లా పూర్తి చేయాలని ఆదేశాలు
- సమస్యల పరిష్కారానికి సమీపిస్తున్న నిర్దేశిత గడువు

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని పురపాలికల్లో ఎస్ఆర్ఎస్ (ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్) దరఖాస్తుల పరిష్కారానికి నిర్దేశించిన గడువు సమీపిస్తుండటంతో పరిశీలన కార్యక్రమంలో వేగం పెంచేందుకు అధికారయంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో పురపాలక సంఘాల అధికారులు కసరత్తును ముమ్మరం చేస్తున్నారు. దరఖాస్తుదారుల సందేహాల నివృత్తికి కలెక్టరేట్ సహా పురపాలక సంఘాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశారు. పురపాలక అధికారులు కూడా ప్రత్యేక బృందాలతో క్షేత్రస్థాయిలో పర్యటించి ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కరించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలోనే మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా పరిధిలోని అన్ని పట్టణాల్లో ఈ ప్రక్రియ వేగవంతమైంది.



పరిష్కారమైన దరఖాస్తులు 86,374

13 పురపాలక సంఘాల పరిధిలో మొత్తం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు 1,64,901 వచ్చాయి. వీటిలో ఇప్పటి వరకు 86,374 దరఖాస్తులు మాత్రమే పరిష్కారమయ్యాయి. మరో 78,527 దరఖాస్తులను ఈ నెలాఖరు వరకు పరిష్కరించాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఫీజు రాయితీ గడువును పెంచాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

పురపాలక సంఘం	మొత్తం దరఖాస్తులు	పరిష్కారమైనవి
నిజాంపేట	4,219	2,124
బోడుప్పల్	17,705	7,346
పీర్జాదిగూడ	9,652	4,463
జవహర్‌నగర్	330	174
ఘట్‌కేసర్	32,126	14,950
నాగారం	18,855	12,507
దమ్మాయిగూడ	21,956	11,426
పోచారం	20,991	9,941
దుండిగల్	15,088	8,708
తూముకుంట	9,182	5,842
గుండ్లపోచంపల్లి	3,035	2,066
కొంపల్లి	2,087	1,237
మేడ్చల్	9,675	5,590

శాఖల మధ్య సమన్వయానికి..

ఎల్ఎర్ఎస్ ప్రక్రియను పురపాలిక సంఘాల్లోని పట్టణ ప్రణాళిక విభాగం, రెవెన్యూ, నీటి పారుదల శాఖల అధికారులు చేపట్టాల్సి ఉంటోంది. దరఖాస్తుల పరిశీలనలో భాగంగా మొదటిదశలో మూడు శాఖల అధికారులు స్థలాన్ని పరిశీలించి జియో ట్యాగింగ్ చేయాల్సి ఉంటోంది. రెండోదశలో టీపీవో పరిశీలించి రుసుం (ఫీజు) నిర్దేశిస్తారు. మున్సిపల్ కమిషనర్ ఆమోదంతో ఎల్ఆర్ఎస్ పరిశీలన ప్రక్రియ పూర్తవుతోంది.

క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

పురపాలక సంఘాల్లోని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి ప్లాట్ డాక్యుమెంట్లను పరిశీలించాలి. రెవెన్యూ అధికారులు ఆ ప్లాట్ వివాదంలో ఉందా.. కేసులు ఉన్నాయా.. ప్రభుత్వానిదా.. ప్రైవేటా.. అని నిర్ధారించాల్సి ఉంటోంది. చెరువులు, కుంటల పరిధిలో స్థలం ఉందా.. లేదా.. అనే విషయాన్ని నీటిపారుదలశాఖ అధికారులు నిర్ధారించి నివేదిక ఇవ్వాల్సి ఉంటోంది.

అధికారుల మధ్య సమన్వయ లోపం..

మూడు శాఖల అధికారుల మధ్య సమన్వయం కోసం కలెక్టర్ సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేసినప్పటికినీ, తీవ్ర జాప్యం జరుగుతోందంటున్నారు. శాఖల మధ్య నెలకొన్న సమన్వయ లోపం కారణంగా దరఖాస్తుల పరిశీలన జాప్యం జరుగుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మూడు శాఖల అధికారులు మాత్రం నిర్లక్ష్యం తమది కాదంటూ దాటవేస్తున్నారు. జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) సెలవుల్లో ఉండటంతో మరో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని పర్యవేక్షించాల్సి వస్తోంది. అదనపు బాధ్యతల వల్ల ఈ ప్రక్రియకు అంతరాయం ఏర్పడుతున్నట్లు తెలుస్తోంది.